క్లుప్తంగా

బూత్ కమిటీల ఎన్నిక

చిట్యాల : గుండ్రాంపల్లి, సుంకెనెపల్లి గ్రామాల బీఆర్ఎస్ పార్టీ బూత్ కమిటీలను సోమవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆవుల అయిలయ్యయాదవ్, ప్రధానకార్యదర్శి కల్లూరి మల్లారెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గుండ్రాంపల్లి గ్రామ బూత్ ఇన్‌చార్జ్‌లుగా బొడిగె బాలరాజు, ఎండీ. వాజిద్, రత్నం నర్సింహ, సుంకెనెపల్లి బూత్ ఇన్‌చార్జ్‌లుగా పోలెపల్లి నాగరాజు, కక్కిరేణి భిక్షం ఎన్నికయ్యారు. డీసీసీబీ వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, సర్పంచ్ కక్కిరేణి బోందయ్య, రత్నం పుష్ప, మండల కోఆప్షన్ సభ్యుడు మోసీస్ పాల్గొన్నారు.

బీఎస్పీ మండల అధ్యక్షుడిగా జోగు శేఖర్



చిట్యాల : మండలంలోని తాళ్ళవెల్లెంల గ్రామానికి చెందిన జోగు శేఖర్ బీఎస్పీ చిట్యాల మండల అధ్యక్షుడిగా నియమితులయ్యారు. శేఖర్‌కు సోమవారం బీఎస్పీ నకిరేకల్ నియోజకవర్గ అధ్యక్షుడు గద్దపాటి రమేష్ నియామకపత్రం అందజేశారు.

ఉచిత వైద్యశిబిరం

చిట్యాల : మండలంలోని వెంబాయి గ్రామంలో ఉచిత వైద్యశిబిరాన్ని సోమవారం ఆ గ్రామ సర్పంచ్ అద్దెల నర్సిరెడ్డి ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో పలువురు గ్రామస్తులకు వినికిడి, గొంతు సమస్యల స్కీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాళ్ళవెల్లంల సర్పంచ్ జనగాం రవీందర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి వెంకన్న, డాక్టర్లు కిరణ్‌కుమార్, శ్రీదేవి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

శాలిగౌరారం : ఎస్సీ వర్గీకరణ బిల్లును చట్టసభల్లో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నవంబర్ 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న విశ్వరూప మహాపాదయాత్రను విజయవంతం చేయాలని ఎంఈఎఫ్(మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్) జిల్లా గౌరవ అధ్యక్షుడు మామిడి సైదులు, ప్రధాన కార్యదర్శి ఆనంద్‌బాబు కోరారు. సోమవారం శాలిగౌరారం మండల కేంద్రంలో పాదయాత్ర పోస్టర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోడ సునిల్, ఎంఈఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింత యాదగిరి, మండల అధ్యక్షుడు సైదులు తదితరులు పాల్గొన్నారు.

లిటిల్ సోల్జర్స్ చేయూత

నకిరేకల్ : మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన పోడిచెటి సైదులు వారం రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స తీసుకుంటున్నాడు. ఏడాది అతడి భార్య మృతి చెందింది. ఇద్దరు పిల్లలు ఉన్నారు. సైదులు ఆర్థిక ఇబ్బందులు పడుతుండడంతో నకిరేకల్‌లోని లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు సోమవారం అతడి ఇంటికి వెళ్లి రూ.20,200 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు బ్రహ్మదేవర నరేష్, ఆసీఫ్, శ్రీను, సైదులు, ప్రసాద్, ప్రవీణ్, నరేష్, కృష్ణప్రసాద్, విష్ణు, విక్రమ్ పాల్గొన్నారు.

పీఏసీఎస్ ప్రైవేటీకరణ ఉపసంహరించుకోవాలి

చండూరు : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ప్రైవేటీకరణ ఉపసంహరించుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నలపరాజు రామలింగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ వరప్రసాద్‌కు మెమోరాండం అందజేసి మాట్లాడారు. రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు బొడ్డు వెంకటేశ్వర్లు, బండమీది వెంకన్న, యాదయ్య, వెంకటేష్, దోటి వెంకన్న పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

నల్లగొండ క్రైం : పుణ్యక్షేత్రాలను దర్శించుకుని వస్తుండగా మార్గమధ్యలో నల్లగొండలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దాదాపు 50 సంవత్సరాల వయసు ఉన్న ఓ వ్యక్తి ఈ నెల 13వ తేదీన తిరుపతి, అరుణాచలం తదితర పుణ్యక్షేత్రాలను దర్శించుకుని తిరుపతి నుంచి నారాయణాద్రి రైలులో ప్రయాణిస్తుండగా నల్లగొండకు రాగానే అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అతడిని రైల్వే పోలీసులు నల్లగొండలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఈ నెల 15 వ తేదీన మృతి చెందాడు.

నల్లగొండ అభివృద్ధి కోసమే బరిలో నిలుస్తున్నా

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడం కోసమే ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరఫున బరిలో నిలుస్తున్నానని పిల్లి రామరాజు యాదవ్ అన్నారు. సోమవారం నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలందరూ తనను ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అంతకు ముందు పానగల్ వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి శేషమ్మగూడెంలో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సరస్వతి సుధాకర్‌రెడ్డి, జానయ్య, నర్సింహయ్య యాదవ్, భూపాల్‌రెడ్డి, సైదులు, లింగస్వామి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలి

మర్రిగూడ : రైతులందరికీ రుణమాఫీ చేయాలని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు బండా శ్రీశైలం అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

● నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణంలో రూ.1,350 కోట్లతో చేపట్టిన పనులు కొన్ని పూర్తయ్యాయని, మరికొన్ని పనులు శరవేగంగా నడుస్తున్నాయని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం పానగల్‌లోని వేంకటేశ్వర ఆలయంలో కంచర్ల భూపాల్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పానగల్‌లో ఎన్నికల ప్రచార కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ మరో రెండు సంవత్సరాల్లో రాష్ట్రంలోనే నల్లగొండ నియోజకవర్గం మోడల్ నియోజకర్గంగా ఉంటుందన్నారు. 20 సంవత్సరాలు పాలించిన వారి మాటలు నమ్మి మోసపోవద్దని, కారు గుర్తుపై ఓటువేసి మరోసారి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. జెడ్పీ చైర్మన్, నల్లగొండ అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జ్ బండా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ నల్లగొండ పట్టణాన్ని అభివృద్ధి చేసి చూపించిన బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల భూపాల్‌రెడ్డిని మరోసారి దీవించి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ముందుగా కోలాటం, డప్పుల మోతలు, మహిళలు మంగళహారతులు పట్టి కంచర్లకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి నిరంజన్‌వలి, మార్కెట్ చైర్మన్ చీర పంకజ్‌యాదవ్, కటికం సత్తయ్యగౌడ్, సుంకరి మల్లేష్‌గౌడ్, మాలె శరణ్యారెడ్డి, సింగం రామ్మోహన్, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కనగల్ ఎంపీపీ కరీంపాష, జెడ్పీటీసీ చిట్ల వెంకటేశం, బోనగిరి దేవేందర్, పల్‌రెడ్డి రవీందర్‌రెడ్డి, ఐతగోని యాదయ్య, దేప వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



వేంకటేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కంచర్ల భూపాల్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీలో చేరిక

నల్లగొండ రూరల్ : మండలంలోని నర్సింగ్‌బట్ల గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య సమక్షంలో సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ తాజ్ జకీర, కాసాని లింగస్వామిగౌడ్, శ్రీనివాస్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చర్చి నిర్మాణానికి విరాళం



చెక్కు అందజేస్తున్న రేఖల భద్రాద్రి

నల్లగొండ : చందనపల్లిలోని యాదా గోత్రపు సింహవాము మినిస్ట్రీ చర్చి నిర్మాణానికి రేఖల అన్నమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా ట్రస్ట్ చైర్మన్, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ ఫెడరేషన్ చైర్మన్ రేఖల భద్రాద్రి సోమవారం రూ.25 వేల విరాళం చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పల్లెబాట



మాట్లాడుతున్న అయితగోని వెంకన్న

శాలిగౌరారం : మండలంలోని జాలోనిగూడెం, శాలిలింగోటం, తుడిమిడి, చిత్తలూరు, వంగమర్తి, ఇటుకులపహాడ్, మాధారంకలాన్, పెర్కకొండారం గ్రామాల్లో సోమవారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు పల్లెబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అయితగోని వెంకన్న, జెడ్పీటీసీ ఎర్ర రణీల, వైస్ ఎంపీపీ కందుల అనితారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ తాళ్ళూరి మురళి, రైతుబంధు మండల కోఆర్డినేటర్ గుండా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్సిడీ ఇవ్వాలి

నల్లగొండ టౌన్ : కిరాయి కార్పెంటర్ దుకాణాలకు నాలుగో కేటగిరీ కింద విద్యుత్ సబ్సిడీ వర్తింపజేయాలని తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చినపాక లక్ష్మీనారాయణ, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానికంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యూనియన్ పట్టణ అధ్యక్షుడు నలిపోజు సైదాచారి, కార్యదర్శి దాసోజు ప్రభు, కోశాధికారి కె.సురేష్, ఉపాధ్యక్షుడు గడగోజు సైదాచారి, గుంటోజు సోమయ్యాచారి, శ్రీనివాసచారి పాల్గొన్నారు.

నగదు, మద్యం స్వాధీనం

రామగిరి(నల్లగొండ): ఎలాంటి ధృవీకరణ పత్రాలు లేకుండా తరలిస్తున్న నగదును తిప్పర్తి పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్బీ నగర్‌కు చెందిన మరిబోయిన సునీల్‌కుమార్ కారులో హైదరాబాద్ నుంచి నర్సరావుపేటకు వెళ్తుండగా పోలీసులు తిప్పర్తి పోలీస్ స్టేషన్ ఎదుట కారును తనిఖీ చేసి రూ. 85 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న నగదును జిల్లా ట్రెజరీకి సమర్పించినట్లు ఎస్ఐ ఎస్.ధర్మా తెలిపారు.

చిట్యాల : పట్టణంలోని భువనగిరి రోడ్డులో బెల్ట్ షాపులో సోమవారం మద్యం సీసాలను పట్టుకున్నట్లు చిట్యాల ఎస్ఐ-2 నవీన్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి రోడ్డులోని ఓ బెల్ట్ షాపులో రూ.7,735 విలువ గల మద్యం సీసాలను పట్టుకుని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

నాటుసారా కేంద్రాలపై దాడి

నాంపల్లి : రాయినికుంట తండాలో సోమవారం నాటుసారా తయారు చేస్తున్న స్థావరాలపై పోలీసులు దాడులు జరిపారు. తండాకు చెందిన మెగావత్ హనుమా సారా తయారు చేస్తుండగా గుర్తించి 10 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు.

కట్టంగూర్‌లో రూ.1,78,500 నగదు పట్టివేత

కట్టంగూర్ : ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా డబ్బును తరలిస్తున్న ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.1,78,500 కట్టంగూర్‌లో పోలీసులు సోమవారం పట్టుకుని సీజ్ చేశారు. వివరాలు .. జాతీయ రహదారిపై ఎస్ఐ రాజు తన సిబ్బందితో నల్లగొండ క్రాస్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా విజయవాడ నుంచి హైదరాబాదుకు వెళ్తున్న ఒక వాహనంలో రూ.81వేలు, మరో వాహనంలో రూ.97,500 లను స్వాధీనం చేసుకుని డీటీఓకు అప్పజెప్పినట్లు ఎస్ఐ తెలిపారు.

కాంగ్రెస్‌తోనే పేదల అభివృద్ధి సాధ్యం

● కాంగ్రెస్ పార్టీ నకిరేకల్ ఎమ్మెల్యే అభ్యర్థి వేముల వీరేశం

కేతేపల్లి : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే పేదల ప్రజల అభివృద్ధి సాధ్యమవుతుందని నకిరేకల్ అసెంబ్లీ నియోకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. కేతేపల్లి మండలంలోని చీకటిగూడెం సర్పంచ్ కోట వెంకటేశ్వరావుతో పాటు పలువురు వార్డు సభ్యులు మాజీ సర్పంచ్ కోట పుల్లయ్య ప్రభావతి ఆధ్వర్యంలో సోమవారం వేముల వీరేశం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వీరేశం మాట్లాడుతూ ఎన్నికల్లో తనకు మద్దతు ఇచ్చి గెలిపించినట్లయితే నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కాంగ్రెస్‌లో చేరినవారిలో వార్డు సభ్యులు వడ్డె దుర్గమ్మ, ఎగ్గడి వీణ, కోట విజయలక్ష్మి పూర్ణయ్య, వెంబడి కనకయ్య, పోకలి రామనాథం తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెరుమాళ్ల శేఖర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌యాదవ్, జటంగి వెంకటనర్సయ్య, కోట పుల్లయ్య, ఎం.ప్రవీణ్‌రెడ్డి, కోట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ కోమటిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిక

చిట్యాల : మండలంలోని పలు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఏఎంసీ మాజీ చైర్మన్లు సోమవారం నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆధ్వర్యంలో భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమక్షంలో నార్కట్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో చిట్యాల ఏఎంసీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు అంతటి వెంకటేష్‌గౌడ్, సర్పంచ్‌లు జనగాం రవీందర్‌గౌడ్, అద్దెల నర్సిరెడ్డి, ఎంపీటీసీ వడ్డెపల్లి లక్ష్మయ్య, ఉప సర్పంచ్ రాచకొండ శ్రీను, పీఏసీఎస్ డైరెక్టర్లు దోర్నాల రామచంద్రం, కంబాలపల్లి కొమురయ్య, మాజీ ఎంపీపీ బట్టు అరుణ అయిలేష్, మాజీ సర్పంచ్ నారగోని దుర్గయ్య, నాయకులు అద్దెల లింగారెడ్డి, గోలి గణేశ్, గోలి మహష్, కాటం గణేశ్, నూతి వెంకటేశం, తెల్పూరి సైదులు, రాచమల్ల జానయ్య తదితరులు ఉన్నారు.



కట్టంగూర్ : పార్టీలోకి ఆహ్వానిస్తున్న వీరేశం

కాంగ్రెస్ పార్టీలో చేరిక

కట్టంగూర్ : మండలంలోని గార్లబాయిగూడెం, తెలువారిగూడెం గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నకిరేకల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వేముల వీరేశం సమక్షంలో నకిరేకల్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాద యాదగిరి, సంద్యాల వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. పార్టీలో చేరినవారిలో ఎడ్ల పెదరాములు, ఉప సర్పంచ్ ఆవుల సైదులు, వార్డు సభ్యులు తేలు సైదులు, చింత శ్రీను, నాయకులు తేలు యాదయ్య, లింగయ్య, శివ, వంగూరి రాజమల్లు, మల్లయ్య, పాల్వాయి రాంరెడ్డి, మోహన్‌రెడ్డి, కంబాలపల్లి లింగయ్య, బక్కయ్య, వానరాశి నాగార్జున, కోటిలింగం, భద్రయ్య, లింగస్వామి ఉన్నారు.

బయోమెట్రిక్‌పై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ నరేందర్‌రెడ్డి

నార్కట్‌పల్లి : వరి ధాన్యం కొనుగోలుకు సంబంధించి బయోమెట్రిక్ విధానంపై రైతులకు అవగాహన కల్పించాలని ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. నార్కట్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన నివేదికలు సమర్పించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు విద్యుత్, వ్యవసాయశాఖకు సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ఐకేపీ సెంటర్‌లో నాణ్యత ఉన్న ధాన్యాన్ని ముందుగా కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు. ఆధార్ కార్డుకు బ్యాంకు అకౌంట్ నంబర్ లింక్ ఉన్న రైతులే పత్తిని అమ్మేందుకు సీసీఎస్ వద్దకు తీసుకెళ్లాలని అన్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ కల్లూరి యాదగిరిగౌడ్, ఎంపీడీఓ యాదగిరిగౌడ్, తహసీల్దార్ పద్మ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కేంద్రాలను త్వరగా ప్రారంభించాలి

కనగల్ : మండల వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరితగతిన ప్రారంభించాలని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు మండల సర్వసభ్య సమావేశంలో కోరారు. సోమవారం ఎంపీపీ కరీంపాష అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు సర్పంచ్‌లు మాట్లాడుతూ బిల్లుల చెల్లింపులను ఆన్‌లైన్ చేసేందుకు మండల కార్యాలయంలోని ఆపరేటర్లు డబ్బులు ఇస్తేనే పనిచేస్తున్నారని ఆరోపించారు. గ్రామాల్లో సర్పంచ్‌లకు సమాచారం ఇవ్వకుండానే కరెంట్ స్తంభాలను ఎక్కడ పడితే అక్కడ వేస్తున్నారని ట్రాన్స్ కో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరిగేషన్ ఏఈలు ఎక్కడ పనిచేస్తున్నరో తమకు తెలియడం లేదని జెడ్పీటీసీ చిట్ల వెంకటేశంగౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఈ, ఈఈ సమావేశానికి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోతి, ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డి, ఏఈలు రాజశేఖరాచారి, షఫీ ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ కరీంపాష

గాయత్రీ దేవి అవతారంలో దుర్గామాత



నల్లగొండ టూటౌన్ : శ్రీనగర్ కాలనీలో పూజలో పాల్గొన్న ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణంలోని పానగల్ రోడ్ శ్రీనగర్ కాలనీలో దుర్గా భవాని యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహం వద్ద సోమవారం అభిషేకం అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, హరి, నారగోని వెంకన్న, మర్రి మల్లేష్, రాజు, నిమ్మనగోటి శ్యాంప్రసాద్, గోగుల గణేశ్, ప్రభాకర్‌రావు, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు : దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వివిధ గ్రామాల్లో ఏర్పాటుచేసిన దుర్గాదేవి విగ్రహాలకు సోమవారం భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చిట్యాలలో..

చిట్యాల : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చిట్యాల పట్టణంలోని శ్రీకనకదుర్గ ఆలయంలో అమ్మవారు సోమవారం గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ అంబటి నాగిరెడ్డి, చైర్మన్ శీలా సత్యనారాయణ, అర్చకులు దౌలతాబాద్ వాసుదేవశర్మ పాల్గొన్నారు.

శాలిగౌరారం : నవరాత్రి ఉత్సవాలు ఉత్సవాల్లో భాగంగా దుర్గామాత సోమవారం గాయత్రీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు దుర్గాదేవి విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

'బీఆర్ఎస్ పార్టీని ఓడిస్తాం'

నల్లగొండ టౌన్ : యువతను మోసం చేసిన బీఆర్ఎస్ పార్టీని రానున్న ఎన్నికల్లో ఓడిస్తామని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ధర్మేంద్ర అన్నారు. సోమవారం స్థానికంగా జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి టి.వెంకటేశ్వర్లు, సభ్యులు నవీన్, జమీర్, సురేష్, లెనిన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపా

● నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్ : గడిచిన నాలుగున్నరేళ్లలో వందల కోట్ల నిధులు ప్రభుత్వం నుంచి తెప్పించి నకిరేకల్ పట్టణంతోపాటు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలబెట్టానని బీఆర్ఎస్ నకిరేకల్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నకిరేకల్ పట్టణంలోని శ్రీకనకదుర్గ ఆలయంలో సోమవారం ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పూజలు చేసి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ముందుగా భారీ రోడ్ షో నిర్వహించారు. మెయిన్ సెంటర్‌లో రోడ్ షోలో చిరుమర్తి లింగయ్యతోపాటు రాజ్యసభ సభ్యుడు, నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్ బడుగుల లింగయ్యయాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిరుమర్తి మాట్లాడుతూ ఈఎన్నికల్లో మరోసారి తనను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ మాట్లాడుతూ నకిరేకల్ పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందాలన్నా, ప్రశాంత పాలన కావాలన్న బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, జెడ్పీటీసీ మాద ధనలక్ష్మీ నగేష్, మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, వైస్ చైర్ పర్సన్ మురారిశెట్టి ఉమారాణికృష్ణమూర్తి, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు ప్రగడపు నవీన్‌రావు, యల్లపురెడ్డి సైదిరెడ్డి పాల్గొన్నారు.

చెర్వుగట్టు ఆలయంలో చిరుమర్తి పూజలు

నార్కట్‌పల్లి : చెర్వుగట్టు గ్రామంలోని శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి ఆలయంలో నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వేద మంత్రాలతో పూజలు నిర్వహించి ఆశీర్వచనం చేసి ఎమ్మెల్యేకు సన్మానం చేశారు. అనంతరం ఎన్నికల ప్రచార వాహనాలకు ఎమ్మెల్యే పూజలు చేశారు. ఈ సందర్భంగా చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ శాసన సభ ఎన్నికల్లో గెలిపించాలని తన ఇష్ట దైవమైన శివయ్యను కోరుకున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీపీలు సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, జ్యోతిబలరామ్, ఎంపీటీసీలు మేకల రాజిరెడ్డి, పుల్లెంల ముత్తయ్య, దుబ్బాక పావని శ్రీధర్, సర్పంచ్‌లు మల్గ బాలకృష్ణ, గోసుల భద్రాచలం, పుష్పలతశంకర్, యానాల మాధవిఅశోక్‌రెడ్డి, ఉపేందర్ పాల్గొన్నారు.



నార్కట్‌పల్లి : చెర్వుగట్టులో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



నకిరేకల్ : ర్యాలీలో పాల్గొన్న కార్యకర్తలు

పార్టీ కార్యాలయం ప్రారంభం

చిట్యాల : మండలంలోని గుండ్రాంపల్లి గ్రామంలో సోమవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, సర్పంచ్‌లు రత్నం పుష్ప, కక్కిరేణి బోందయ్య, మండల కోఆప్షన్ సభ్యుడు మోసీన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆవుల అయిలయ్య, ప్రధాన కార్యదర్శి కల్లూరి మల్లారెడ్డి, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు చెర్కుపల్లి శశిరేఖ తదితరులు పాల్గొన్నారు.

హామీలు వందశాతం అమలు చేస్తాం

● మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

చిట్యాల : బీజేపీ ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేస్తుందని భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, నకిరేకల్ శాసనసభ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్ కపిలవాయి దిలీప్‌కుమార్ అన్నారు. చిట్యాలలో సోమవారం నకిరేకల్ నియోజకవర్గంలోని గ్రామాల బూత్ కమిటీ ఇన్‌చార్జ్‌ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అమలు చేయలేని హామీలు ఇస్తోందని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ప్రత్యామ్నాయంగా ఉన్న బీజేపీని రాష్ట్రంలో గెలిపిస్తే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మైల నర్సింహ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శేపూరి రవీందర్, భువనగిరి పార్లమెంటు పార్టీ కన్వీనర్ లింగస్వామి, నకిరేకంటి మొగులయ్య, అయితగోని అనిత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

మునుగోడు నుంచే ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తా



పూజలు చేస్తున్న రాజగోపాల్‌రెడ్డి

నాంపల్లి : అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తానని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని రేవల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన దుర్గామాత ఆలయంలో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత తాలుకా కేంద్రమైన నాంపల్లిని రెవెన్యూ డివిజన్ చేయడానికి తమవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎరెడ్ల రఘుపతిరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు పూల వెంకటయ్య, దాచపల్లి నర్సింహ, కత్తి రవీందర్‌రెడ్డి, చంద్రారెడ్డి, కొండల్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్ గౌడ్ సమక్షంలో బీజేపీలో చేరిక

కనగల్ : మండల పరిధిలోని దోరెపల్లి గ్రామంలో పలువురు ప్రజాప్రతినిధులు సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్ గౌడ్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఉప సర్పంచ్ దాసరి వెంకన్న, వార్డు సభ్యులు నకిరేకంటి నరేష్, మాదగోని విజయలక్ష్మిశంకర్, బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మాదగోని సైదులు, బీఆర్ఎస్ మండల కార్యవర్గ సభ్యుడు మాదగోని ఏడుకొండలు, పసునూరి వెంకన్న, బక్క లింగయ్య, మాదగోని అశోక్, పగిళ్ల రాములు, బక్క శివకుమార్, కిన్నెర యాదయ్య, దాసరి సాయిలు, దాసరి లచ్చయ్య, బైరగోని చంద్రయ్య, మాదగోని నరేందర్, మాదగాని వెంకన్న, బైరగోని శివశంకర్, నర్సింహ, పగిళ్ల వెంకన్నలకు మాదగోని శ్రీనివాస్‌గౌడ్ బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కనగల్ మండల అధ్యక్షుడు పులకరం భిక్షం, మాదగోని సురేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాదగోని శ్రీనివాస్‌గౌడ్

ఆర్థికసాయం అందజేత

కనగల్ : మండల కేంద్రానికి చెందిన మహేశ్వరం ఈశ్వరమ్మ అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బాధిత కుటుంబానికి రూ.20వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కనగల్ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు కూసుకుంట్ల రాజిరెడ్డి, సర్పంచ్ నర్సింగ్ సునితాకష్ణయ్య, ఉప సర్పంచ్ సింగం పెద్దలు, పోలే విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఈశ్వరమ్మ కుటుంబానికి ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని ఎంపీపీ కరీంపాష, జెడ్పీటీసీ చిట్ల వెంకటేశంగౌడ్ ద్వారా అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అయితగోని యాదయ్యగౌడ్, సర్పంచ్ తలారి కరుణశ్రీరవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మేనిఫెస్టోను గడపగడపకు తీసుకెళ్లాలి

రామగిరి(నల్లగొండ): రాబోయే 45 రోజులు కాంగ్రెస్ పార్టీకి కీలకమని, 6 గ్యారెంటీల మేనిఫెస్టోను గడప గడపకు తీసుకెళ్లాలని తిప్పర్తి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం సుధీర్ కార్యకర్తలకు సూచించారు. సోమవారం తిప్పర్తి మండల కేంద్రంలో తిప్పర్తి మండల యూత్ కాంగ్రెస్ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలు సమష్టిగా పనిచేసి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, తిప్పర్తి మండల అధ్యక్షుడు జూకూరి రమేష్, పల్లె ఎల్లయ్య, పాదూరి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

నల్లగొండ క్రైం: శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తప్పవని, పీడీ యాక్టు నమోదు చేస్తామని నల్లగొండ ఎస్పీ అపూర్వరావు అన్నారు. నల్లగొండ పట్టణంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్ చౌరస్తా వద్ద ఆదివారం రెండు వర్గాలు దాడులు చేసుకోవడంతో ఇరు వర్గాలపై కేసులు నమోదు చేసినట్లు సోమవారం ఎస్పీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణంలోని రెహమాన్‌బాగ్‌కు చెందిన షేక్ హసనుద్దీన్ అలియాస్ హన్ను వీసా ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. మాన్యంచెల్కకు చెందిన ముసిదర్ హమ్మద్ అలియాస్ అబ్దుల్లా వద్ద కరోనా కంటే ముందు రూ.1.10లక్షలు తీసుకొని ఖతార్ పంపేందుకు ఒప్పందం చేసుకొని వీసా ఏర్పాట్లు చేశాడు. కాగా కరోనా లాక్‌డౌన్ కారణంగా వీసా గడువు ముగిసింది. దీంతో అప్పటి నుంచి తాను ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని షేక్ హసనుద్దీన్‌ను అబ్దుల్లా అడుగుతున్నాడు. ఇదే విషయమై ఆదివారం లిటిల్ ఫ్లవర్ స్కూల్ సమీపంలో ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో రౌడీ షీటర్లు పాల్గొనడంతో మొత్తం 12మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు.

హైవేపై వాహనాల తనిఖీ

కేతేపల్లి : మండలంలోని చీకటిగూడెం శివారులో 65వ నంబర్ జాతీయ రహదారిపై పోలీసులు సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. చీకటిగూడెంలోని పెట్రోల్ పంపు సమీపంలో పోలీసులు హైదరాబాద్ వైపు వెళ్లే ప్రతి వాహనాన్ని నిలిపి తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో శాలిగౌరారం సీఐరాఘవరావు, కేతేపల్లి ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.